# స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా పని చేయాలి

■ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 17 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పోలీసులకు ఎన్నికల విధులు, విధివిధానాలు, శాంతి భద్రతల పరిరక్షణ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పని చేయాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ప్రతి ఒక్కరూ అమలు చేయాలని, ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు, ముందు, తర్వాత రోజుతో పాటు ఎన్నికల ఫలితాలు వచ్చే రోజు వరకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీస్ అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, అదేవిధంగా ఎన్నికల నిర్వహణలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, వెల్నరబుల్ పోలింగ్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని, విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్

వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లకు రక్షణ కల్పించడం, ప్రతి కేంద్రానికి నిర్దిష్టమైన పోలీస్ బందోబస్తును ముందుగానే ఏర్పాటు చేయడం, ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రవర్తన నియమాలను కచ్చితంగా అమలు పరచాలని అన్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న సోషల్ మీడియా సందేశాలు, వీడియోలు వైరల్ చేసే ఏ చిన్న విషయమైన పైఅధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వర రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకట రమణ, కాగజ్ నగర్ డీఎస్పీ కరుణాకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేశ్, ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, డీసీఆర్‌బీ సీఐ రమేశ్, జిల్లాలోని సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

# మొదటి రాండమైజేషన్ పూర్తి

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 17 : శాసనసభ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి సప్లిమెంటరీ బ్యాలటింగ్ యూనిట్ల రాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి సప్లిమెంటరీ బ్యాలటింగ్ యూనిట్ల రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి 17 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో నియోజకవర్గంలోని 305 పోలింగ్ కేంద్రాలకు 2వ బ్యాలటింగ్ యూనిట్ అవసరం ఉన్నందున 20 శాతం అదనంతో 382 బ్యాలటింగ్ యూనిట్లను మొదటి సప్లిమెంటరీ రాండమైజేషన్ చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలింగ్ జరిగే రోజున ఆయా కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డింగ్ చేసేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాం



స్ట్రాంగ్‌రూంను సందర్శిస్తున్న కలెక్టర్

తంగా జరిగేందుకు, పోలింగ్ రోజున ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం ఈవీఎం గోదాములో భద్రపరిచిన బ్యాలటింగ్ యూనిట్ల రాండమైజేషన్‌లో కేటాయించిన బ్యాలటింగ్ యూనిట్లను ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, పీటీజీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్ బ్యాలెట్ యూనిట్లను తరలించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 'పల్లె ప్రగతి'తో మారిన గ్రామాల రూపురేఖలు

- ■ ఊరూరా డంప్‌యార్డులు, వైకుంఠధామాలు
- ■ పరిశుభ్రంగా గ్రామాలు
- ■ పచ్చని వాతావరణంలో పల్లెలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 17(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు కొత్తరూపును సంతరించుకున్నాయి. ప్రతి నెలా నిధులు మంజూరు కావడంతో సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టడంతో అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. సెప్టెంబర్ 2019లో ప్రభుత్వం ప్రారంభించిన పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల రూపురేఖలు మారాయి. జిల్లాలోని పంచాయతీలకు సెప్టెంబర్ 2019 నుంచి ప్రతి నెలా 227 కోట్ల రూపాయలు క్రమం తప్పకుండా వస్తున్నాయి.




కౌటాలలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం

## జీవ వైవిధ్యాన్ని పెంపొందించే వనాలు...

గ్రామాల్లో జీవన వైవిధ్యాన్ని పెంపొందించేలా ప్రభుత్వం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. విశాలమైన ప్రభుత్వ స్థలాలను చూసి అందులో రకరకాల మొక్కలు నాటి, వాటి మధ్యన రోడ్డు, పార్కులుగా ఏర్పాటు చేసింది. దీంతో పల్లెలు కొత్త అందాలు సంతరించుకున్నాయి.

## వన నర్సరీతో మొక్కలు పుష్కలం...

పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసింది. 335 గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి, ఎకరం నుంచి అర ఎకరం స్థలంలో నర్సరీలను ఏర్పాటు చేశారు. హరితహారం ద్వారా ప్రభుత్వం ప్రతి సంవత్సరం పెద్దఎత్తున మొక్కలు నాటుతోంది. గతంలో మండల కేంద్రాల నుంచి మొక్కలు రవాణా చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రతి గ్రామంలో నర్సరీ అందుబాటులోకి వచ్చింది.

## రైతు వేదికలు సిద్ధం...

గ్రామాల్లో రైతులకు సమాచారం అందించేలా రైతు వేదికలు ఏర్పాటు చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 70 క్లస్టర్లలో రైతు వేదికలను అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక్కొక్క రైతు వేదికకు రూ.22లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసింది. రైతుల సమస్యలు పూర్తి స్థాయిలో రైతు వేదికల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతోంది. విత్తనాలు ఎంపిక, పంటలు వేయడం, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగం, పంటల సమస్యలపై చర్చించేందుకు రైతు వేదికలు ఉపయోగపడుతున్నాయి. రైతులకు అవగాహన కార్యక్రమాలను వేదికల్లో నిర్వహించనున్నారు. వ్యవసాయ సిబ్బంది వేదికల్లో అందుబాటులో ఉండనున్నారు. జిల్లా వ్యాప్తంగా 70 వేదికలు నిర్మించారు.

## పంచాయతీలకు ట్రాక్టర్లు

ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్రాలీలు, వాటర్ ట్యాంకర్లను సమకూర్చడంతో ఎంతో సౌకర్యంగా మారింది. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి. గ్రామాల్లో సేకరించే చెత్తాచెదారాన్ని డంప్‌యార్డులకు తరలించేందుకు ఎంతో ఉపయోపడుతున్నాయి. హరితహారంలో గ్రామాల్లో నాటిన మొక్కలకు నీటి సరఫరా చేసేందుకు ట్యాంకర్లు వినియోగిస్తున్నారు. గ్రామాల్లో నీటి సమస్య తీరింది. పంచాయతీలకు అందించిన ట్రాక్టర్లు గ్రామాల్లో బహుళ ప్రయోజనకరంగా మారాయి.

## తీరిన అంత్యక్రియల సమస్యలు...

గ్రామాల్లో వైకుంఠధామాలు లేక మరణించి వారికి దహన సంస్కారాలు చేసేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే వారు. దీనిని తీర్చేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో వైకుంఠధామం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ స్థలాలు గుర్తించి వైకుంఠధామాలు నిర్మించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో దహన సంస్కారాల సమస్య తీరుతోంది. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు 332 గ్రామ పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. ఒక్కొక్క వైకుంఠధామానికి ప్రభుత్వం రూ.13 లక్షలు ఖర్చు చేసింది.

## తీరిన చెత్త ఇక్కట్లు

గ్రామాల్లో గతంలో చెత్తాచెదారాన్ని సరిగా తొలగించేవారు కాదు. మేజర్ పంచాయతీల్లో మాత్రమే వీధులను శుభ్రం చేసి చెత్తాచెదారాన్ని తొలగించే వారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో వీధుల్లో చెత్తా చెదారాన్ని తొలగించి దానిని గ్రామానికి దూరంగా వేస్తున్నారు. చెత్తను ఆరుబయట వేయకుండా డంప్‌యార్డులను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని తీసుకెళ్లి డంప్‌యార్డుల్లో వేయడంతో గ్రామాలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. జిల్లాలో 334 గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు అందుబాటులోనికి వచ్చాయి. ప్రతి సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.5 లక్షలు ఖర్చు చేసింది.

- ♦ జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు ప్రభుత్వం ప్రతి నెలా 227 కోట్ల రూపాయలు మంజూరు చేస్తోంది. ఇప్పటి వరకు 6356 కోట్ల రూపాయలు ప్రభుత్వం జిల్లాకు అందించింది
  2019లో –908 కోట్ల రూపాయలు
  2020లో –2724 కోట్ల రూపాయలు
  2021లో – 2724 కోట్ల రూపాయలు
- ♦ జిల్లాలో రైతు వేదికలు 70 నిర్మించారు. ఒక్కొక్క రైతు వేదికకు 22 లక్షల చొప్పున 15 కోట్ల 40 లక్షల రూపాయలను ప్రభుత్వం వెచ్చించింది.
- ♦ జిల్లాలో వైకుంఠధామాలు 335 , ఒక్కొక్క దానికి ప్రభుత్వం 13 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. వీటి కోసం రూ.43 కోట్ల 55 లక్షలు వెచ్చించింది.
- ♦ ట్రాక్లరు, ట్రాలీలు, నీటి ట్యాంకుల కోసం 335 గ్రామ పంచాయతీల్లో అందుబాటులోనికి తెచ్చింది.
- ♦ జిల్లాలో 335 పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్ల కోసం 8 కోట్ల 37 లక్షల 50 వేలు ఖర్చు చేసింది.
- ♦ జిల్లాలో 335 పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు.



చింతలమానేపల్లిలోని పల్లె ప్రకృతి వనంలో పెరిగిన చెట్లు



కౌటాలలోని వైకుంఠ ధామం

# రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 17 : మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో చదువుకుంటున్న ఎనిమిది మంది విద్యార్థినులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహిస్తూ ప్రథమ స్థానంలో గెలుపొందారని జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ మీనా రెడ్డి తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు, ఖోఖో కోచ్ తిరుమల్‌ను ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఆర్ రమాదేవి ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ కృష్ణారావు, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పీ సాంబశివ రావు, పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నరేందర్, కృష్ణమూర్తి, పీడీ మధుసూదన్, శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, వార్డెన్ విజయశాంతి, పాఠశాల ఉపాధ్యాయ బృందం క్రీడాకారులను అభినందించారు.



ఖోఖో కోచ్ తిరుమల్‌తో కలిసి బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు